సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



టమాట కిలో రూ.18
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18, కనిష్టం రూ.4.50, సరాసరి ధర రూ.10 పలికింది.



హోరాహోరీగా 'ఎస్‌పీఎల్'
అనంత క్రీడా గ్రామం వేదికగా మూడు ప్రధాన మైదానాల్లో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు హోరాహోరాగా సాగాయి. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
31.8°/14.2°
జిల్లా అంతటా ఆదివారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

పుట్టపర్తి అర్బన్: జిల్లా కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండలస్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. అర్జీలు ఇచ్చే వారు ప్రతి అర్జీలోనూ వారి ఫోన్ నంబర్, ఆధార్ నంబర్ తప్పనిసరిగా పొందుపరచాలన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..
జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ స్పందన కార్యక్రమం స్థానిక కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తామన్నారు. స్పందనలో అర్జీలు ఇచ్చేవారు తమ దరఖాస్తులో ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ



పుట్టపర్తి: వెంగళమ్మచెరువులో వృద్ధునికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ విజయ్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఈ నెలకు సంబంధించిన సామాజిక పింఛన్ల పంపిణీ ముగిసింది. 1 నుంచి ఆదివారం దాకా 99.10 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. జిల్లాలోని 32 మండలాల పరిధిలోని 2,66,045 మంది లబ్ధిదారులకుగాను రూ.73,82,47,500 నగదు మంజూరు చేశారు. ఆదివారం సాయంత్రానికి 2,63,647 మంది లబ్ధిదారులకు రూ.73,16,04,500 మొత్తాన్ని అందజేశారు. సుమారు 99.10 శాతం మందికి పింఛన్లు అందించారు. ప్రతి నెలా ఆలస్యం లేకుండా పింఛన్ మొత్తం చేతికిస్తుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెలాఖరులోపు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

పుట్టపర్తి: జిల్లా ఉన్న ప్రభుత్వ పెన్షనర్లు ఈ నెలాఖరులోపు లైఫ్ సర్టిఫికెట్లు అందచేయాలని జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామకృష్ణయ్య తెలిపారు. ఆయన ఆదివారం కొత్తచెరువులో ఆ సంఘం జనరల్ సెక్రటరీ నాగార్జునశెట్టి తదితరులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టి తీసుకురావాలన్నారు. ఈకేవైసీ, డీఏ బకాయిలు తదితర అంశాలపై చర్చించారు.

విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నీ విజేత ఆంధ్ర బీ జట్టు



విన్నర్‌గా నిలిచిన ఆంధ్ర బీ జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ టోర్నీ విజేతగా ఆంధ్ర బీ జట్టు నిలిచింది. అనంత క్రీడా గ్రామంలోని ప్రధాన క్రీడా మైదానంలో ఆదివారం ఆంధ్ర ఏ, ఆంధ్ర బీ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర బీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 231 పరుగులు చేసింది. జట్టులో రోషిరెడ్డి 57 బంతుల్లో 16 ఫోర్ల సహాయంతో 104 పరుగులతో అజేయంగా నిలిచాడు. లీలాకృష్ణ 31 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 57 పరుగులు చేశాడు. ఆంధ్ర ఏ జట్టు బౌలర్లలో ఆదాం, చరణ్‌జిత్, వేణు చెరొక వికెట్ సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆంధ్ర ఏ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 149 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో సుబ్బరాయుడు 39, వెంకటయ్య 22 పరుగులతో రాణించారు. ఆంధ్ర బీ జట్టు బౌలర్లలో బ్రహ్మయ్య, శశి చెరి రెండు వికెట్లు తీశారు. ఆంధ్ర బీ జట్టు 82 పరుగులతో విజయం సాధించింది.

- అనంతరం ఆంధ్ర ఏ, బీ జట్లలోని క్రీడాకారులతో కూడిన ఆంధ్ర విభిన్న ప్రతిభావంతుల జట్టు మార్నింగ్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) జట్టుతో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్‌లో విభిన్న ప్రతిభావంతుల జట్టు 85 పరుగులతో గెలుపొంది సకలాంగులకు దీటుగా రాణించగలమని నిరూపించారు. ముగింపు కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టోర్నీలో విజేతలుగా నిలిచిన జట్లకు వారి చేతుల మీదుగా ట్రోఫీలు అందించారు.

కలల సౌధం సాకారం



చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు షహీనా. హిందూపురం పట్టణ సమీపంలోని మణేసముద్రం. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ప్రభుత్వం నుంచి ఇల్లు మంజూరు అయింది. మెటీరియల్ దగ్గరి నుంచి బిల్లుల దాకా అన్ని విధాలా సహకారం లభించడంతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసి గృహప్రవేశం చేశామని షహీనా హర్షం వ్యక్తం చేశారు.



ధర్మవరంలోని జగనన్న లేఅవుట్‌లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు



ఈమె మల్లీశ్వరి. ధర్మవరం పట్టణం శాంతినగర్ వాసి. ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు లేక ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయడంతో పాటు సకాలంలో బిల్లులు చెల్లించడంతో ఇంటి నిర్మాణం పూర్తయిందని మల్లీశ్వరి తెలిపారు. జగనన్న ప్రభుత్వంలోనే తమ సొంతింటి కల సాకారమైందని సంతోషం వ్యక్తం చేశారు.

- జోరుగా ఇళ్ల నిర్మాణ పనులు
- చాలా ప్రాంతాల్లో తుదిదశకు నిర్మాణాలు
- జగనన్న కాలనీల్లో చురుగ్గా మౌలిక వసతుల కల్పన
- ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలు చేసేలా అధికారుల చర్యలు

పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి మెటీరియల్, సకాలంలో బిల్లులను కూడా చెల్లిస్తూ అండగా నిలుస్తోంది. ఇప్పటికే చాలా మంది లబ్ధిదారులు సొంతిళ్లలోకి చేరిపోయారు. తుదిదశకు చేరిన వాటిని ఉగాది పండుగ నాటికి పూర్తి చేయించి సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

సాక్షి, పుట్టపర్తి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల ప్రక్రియ వేగం పెరిగింది. పేదలు తమకు కేటాయించిన స్థలాల్లో గృహ నిర్మాణాలను చేపట్టి వేగంగా పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో పడ్డ అవస్థలు తీరుతుండటంతో సంబరపడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పేదల సొంతింటి కల సాకారం దిశగా పాలన సాగిస్తున్నారని లబ్ధిదారులు కొనియాడుతున్నారు. అవసరమైన నిధులు కేటాయింపులు జరిగేలా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి సమీపంలో బ్రాహ్మణపల్లి, బీడుపల్లి, జగరాజుపల్లి, ఎనుములపల్లి వద్ద జగనన్న కాలనీలు వెలిశాయి. అలాగే ధర్మవరం పట్టణ సమీపంలోని కాలనీలో చాలా ఇళ్ల నిర్మాణం పూర్తి దశకు చేరుకున్నాయి.

పనుల పరుగులు..
ప్రభుత్వ మార్గదర్శకాలతో నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 168 జగనన్న లేఅవుట్‌లలో 24,643 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పేదలకు నివాసయోగ్యం కింద ఇల్లు మంజూరు చేశారు. జిల్లాకు సంబంధించి మొత్తం 62,716 ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటికే కొన్ని నిర్మాణాలు పూర్తి కాగా.. మిగిలిన వాటి పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి.

ఇబ్బందుల్లేకుండా చర్యలు..
ఒక్కో ఇంటికి ఇచ్చే రూ.1.80 లక్షలకు తోడు డీఆర్‌డీఏ ద్వారా డ్వాక్రా సంఘ సభ్యులకు ఇంటి నిర్మాణానికి రూ.35 వేల రుణం బ్యాంకుల ద్వారా అందేలా చర్యలు చేపట్టారు. ఈ రుణంతో లబ్ధిదారులు బయటి వ్యక్తుల ద్వారా అప్పులు చేయకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. దీనికి తోడు ఇబ్బందిలేకుండా ఇసుక, మెటీరియల్ అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

మౌలిక వసతుల కల్పన..
జిల్లా వ్యాప్తంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా 168 లేఅవుట్‌లు ఏర్పాటు చేశారు. ఆయా లేఅవుట్‌లలో విద్యుత్ లైన్లు, రహదారులు, కరెంటు మీటర్లు, తాగునీటి వసతుల కల్పన వంటి పనులు చేపట్టారు. ఫలితంగా కాలనీలు కొత్తరూపు సంతరించుకున్నాయి.

ఇళ్ల నిర్మాణాల పురోగతి ఇలా..	
జిల్లాకు మంజూరైన ఇళ్లు	62,716
జగనన్న లేఅవుట్లు	168
నిర్మాణాలు పూర్తి చేసుకున్నవి	5,750
పైకప్పు పూర్తయినవి	3,713
పైకప్పు వరకు	2,742
పునాది వరకు	12,403
పునాది పనుల్లో..	22,230
ప్రారంభం కానివి	15,878

విలువైన స్థలం దక్కింది



మెయిన్ రోడ్డు పక్కనే సుమారు రూ.5 లక్షలు విలువ చేసే స్థలం ఇచ్చారు. అన్ని రకాల మౌలిక వసతులు కల్పించారు. మా ఇంటి నిర్మాణం పూర్తయింది. బిల్లులు కూడా జమ అయ్యాయి. అన్న మాదిరిగా జగనన్న అండగా ఉండి గూడు ఇచ్చారు. – సాయికళ, జగరాజుపల్లి

ఉగాదికి కొత్త ఇంట్లోకెళ్తాం



నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకంలో బ్రాహ్మణపల్లి శివారున ఉన్న జగనన్న కాలనీలో ఇల్లు నిర్మిస్తున్నాం. సకాలంలో బిల్లులు చెల్లిస్తున్న కారణంగా ఇప్పటికే పైకప్పు వరకు నిర్మాణం పూర్తయింది. ఉగాది నాటికి కొత్త ఇంట్లోకి అడుగు పెడతాం. – సువర్ణ, పుట్టపర్తి

సకాలంలో నిర్మాణాల పూర్తి



ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే చాలా చోట్ల గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. ఉగాది పండుగ నాటికి మొత్తం నిర్మాణాలు పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలు చేయిస్తాం. – చంద్రమౌళిరెడ్డి, హౌసింగ్ పీడీ

గోవిందా.. గోవింద

- వైభవంగా పేట వేంటరమణస్వామి బ్రహ్మరథోత్సవం
- భక్తులతో కిటకిటలాడిన 'పురం'



విశేష అలంకరణలో పేట వెంకటరమణస్వామి

హిందూపురం: గోవింద నామస్మరణతో హిందూపురం పట్టణం మార్మోగింది. అశేష భక్త జనవాహిని మధ్య పేట వెంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం కనుల పండువగా సాగింది. ఉదయం నుంచే స్వామివారి మూలవిరాట్ వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామికి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం రథం ముందు వేద పండితులు రథాంగ హోమం నిర్వహించి శాంతిపూజలు జరిపారు. తర్వాత మేళతాళాలు, భజాభజంత్రీలతో ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి పూజలు చేశారు. ప్రాకారోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వెంకట రమణస్వామి రథంపై కొలువుదీర్చి రథోత్సవాన్ని నిర్వహించారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు: రథోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్, ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు తరలివచ్చి ఆలయంలోని వెంకట రమణస్వామికి పూజలు జరిపించారు.

అశేష భక్తజనుల మధ్య రథోత్సవం: రథోత్సవానికి వేలాది మంది భక్తులు తరలిరావడంతో హిందూపురం మెయిన్ బజారు కిటకిటలాడింది. భక్తులు ఆకులు, పూలు, అరటిపండ్లను రథంపై విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద నుంచి గాంధీసర్కిల్ వరకు లాగి అనంతరం సింగర్‌చౌక్ వద్దకు తీసుకువెళ్లి నిలిపారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సీఐలు వెంకటేశులు, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



భక్తజన సందోహం మధ్య రథోత్సవం

ఇంటి వద్దకే వైద్యం



ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ (ఫైల్)

ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం పేదలకు వరంలా మారింది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు, గర్భిణులు, బాలింతలు చెకప్ కోసం ప్రతి నెలా పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడంత దూరం వెళ్లాల్సిన అవసరం లేదు. నిర్దేశిత తేదీల్లో ఇంటి వద్దకే వైద్యులు వచ్చి.. పరీక్షలు నిర్వహించి, వారికి మందులు ఉచితంగా అందిస్తున్నారు.

- 'ఫ్యామిలీ ఫిజిషియన్' సక్సెస్
- ఉమ్మడి జిల్లాలో పోటీపోటీగా సేవలు
- వ్యయప్రయాసలు తగ్గించిన ప్రభుత్వం
- ఉచితంగా వైద్య పరీక్షలు.. మందులు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, ఆరోగ్యశ్రీ రోగులకు ఉప శమనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ధనవంతులకు ఏ చిన్న జబ్బు వచ్చినా ఫ్యామిలీ డాక్టర్‌ను సంప్రదిస్తారు. డాక్టర్ ఇంటికి వచ్చి వైద్యం చేసి వెళ్తారు. మరి పేదలకు అంతటి ఆర్థిక స్తోమత ఉండదు కనుక ప్రభుత్వాస్పత్రులకు వెళ్లాల్సిందే. కదలలేని వారు, సహాయకులు లేని వారు, మంచాలకే పరిమితమైన రోగులు సరైన వైద్యం పొందలేకపోయే వారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ఎక్కడా లేని విధంగా 'ఫ్యామిలీ ఫిజీషియన్' ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉమ్మడి జిల్లాలో వైద్య సేవలు పోటాపోటీగా రోగులకు అందుతున్నాయి. వైద్యుల బృందం గ్రామాల్లోకి వస్తోందంటే విశేష స్పందన కనిపిస్తోంది. ఇప్పటివరకు అనంతపురం జిల్లాలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల ద్వారా 91,816 మందికి లబ్ధి జరిగింది. శ్రీసత్యసాయి జిల్లాలో మరో అడుగు ముందుకేసి 92,560 మందికి సేవలందించారు. ఎంతోమంది వృద్ధులు, మహిళలు, బాలింతలు, గర్భిణులకు వైద్యులు ఇంటి వద్దకే వెళ్లి సేవలందిస్తున్నారు. చెంతకే వచ్చి వైద్య, రక్త పరీక్షలు చేయడం.. ఉచితంగా మందులు ఇవ్వడంతో పేదలకు ఆరోగ్యంపై భరోసా కలిగింది. మాకు ఏ జబ్బు చేసినా ప్రభుత్వముంది అన్న ధైర్యంతో ఉన్నారు.

హైపర్ టెన్షన్ రోగులకు ఊరట..
చాలామందికి హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) నియంత్రణలో లేక పక్షవాతానికి (పెరాలసిస్) గురయ్యేవారు. దీనివల్ల శాశ్వత వికలాంగులుగా మారేవారు. దీన్ని నియంత్రించేందుకు ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతోంది. గడిచిన కొద్ది నెలల్లోనే అనంతపురం జిల్లాలో 17,698 మంది హైపర్‌టెన్షన్ బాధితులకు, శ్రీసత్యసాయి జిల్లాలో 14,869 మంది బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. మిగతా జీవనశైలి జబ్బులకూ సేవలందించారు.

ఇప్పటివరకు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థ మార్చి నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది.

జిల్లాలో జనవరి 25 నాటికి ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలు	
మొత్తం లబ్ధిదారులు	92,560
జనరల్ ఓపీ	53,269
గర్భిణులు	5,872
బాలింతలు	4,837
రక్తహీనత	407
హైపర్‌టెన్షన్	14,869
డయాబెటిక్	10,546
ఓరల్ క్యాన్సర్	179
బ్రెస్ట్ క్యాన్సర్	33
సర్వైకల్ క్యాన్సర్	246
టీబీ	07

ఇంటికే వచ్చి వైద్యం అందించారు



నాకు 85 ఏళ్లు. కాళ్ల నొప్పులు. బయటకు వెళ్లాలంటే కాళ్లు సహకరించవు. ఇంటి వద్దనే ఉంటున్నా. ప్రభుత్వం ఇంటి వద్దకే వైద్యం అందించే పథకం తెచ్చింది. దీంతో డాక్టర్లు పుట్టపర్తి నుంచి మా ఊరికే వస్తున్నారు. మా ఇంటివద్దకే వచ్చి వైద్యం చేశారు. ఇప్పుడుడాక్టర్ వద్దకు వెళ్లడం...అక్కడ క్యూలో నిలబడడం లేదు. చాలా సంతోషంగా ఉంది. – లింగమ్మ, జగరాజుపల్లి

సీఎంకు రుణపడి ఉంటాం



నేను పెరాలసిస్‌తో చాలా రోజులుగా మంచానికే పరిమితమయ్యాను. వైద్యుడి దగ్గరకూ వెళ్లలేక గతంలో తీవ్ర ఇబ్బందులు పడ్డాను. వైద్యుడి వద్దకు వెళ్లాలంటే ఆటో మాట్లాడుకుని ఓ మనిషి తోడుతో వెళ్లేదాన్ని. ఇప్పుడు సీఎం జగనన్న ఫ్యామిలీ ఫిజీషియన్ అమలు చేయడంతో ఇంటి వద్దకే వచ్చి వైద్యమందిస్తున్నారు. – రెడ్డెమ్మ, పెరాలసిస్ బాధితురాలు, జగరాజుపల్లి

ప్రజల వద్దకే వైద్యం



ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని పక్కగా అమలు చేస్తున్నాం. ప్రజల నుంచి చక్కని 'స్పందన' వస్తోంది. వైద్యులు రోగుల ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. రానున్న రోజుల్లో ఏయే ప్రాంతాల్లో ఏ వ్యాధి గ్రస్తులు ఉన్నారనే విషయంపై పూర్తి స్పష్టత వస్తుంది. అప్పుడు మరింత మెరుగైన వైద్యసేవలందించేందుకు వీలు కలుగుతుంది. – ఎస్. వెంకట కృష్ణారెడ్డి, డీఎంహెచ్‌ఓ

నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, చిత్రంలో ఎంపీ మాధవ్, ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, శంకరనారాయణ, జెడ్పీచైర్‌పర్సన్, ఎస్పీ తదితరులు

కదిరి: జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా అధునాతన గదులతో నిర్మించిన కదిరి టౌన్ నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆదివారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రారంభించారు. ఆయనకు ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్‌తో పాటు అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ భవ్యకిషోర్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోరే జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థతో పాలన ప్రజల చెంతకే వచ్చిందని, నాయకుల సిఫారసు లేకుండానే అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. శాంతిభద్రతల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉందని, ఈ విషయంలో సొంత పార్టీ నాయకులు తప్పు చేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అనంతరం మంత్రికి ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి చిత్రపటాన్ని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి బహూకరించారు. మంత్రి వెంట ఎంపీ గోరంట్ల మాధవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ బసంత్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా తదితరులున్నారు.

ఫోన్ ట్యాపింగ్ అవాస్తవం

- మంత్రి గుమ్మనూరు జయరాం

కదిరి: తన ఫోన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందంటూనె నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన ఆరోపణలు అర్థరహితమని శ్రీ సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆదివారం ఆయన శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో నూతనంగా నిర్మించిన పట్టణ పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు. కోటంరెడ్డి టీడీపీలోకి వెళ్లడానికి సిద్ధమై.. ప్రభుత్వంపై బురద జల్లేందుకు ఫోన్ ట్యాపింగ్ అంటూ మాట్లాడుతున్నారని విమర్శించారు. కోటంరెడ్డిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాగా అభిమానిస్తారని, అలాంటి వ్యక్తి నోటి వెంట ఇలాంటి మాటలు రావడం బాధాకరమన్నారు. ఆయన చంద్రబాబు ట్రాప్‌లో పడి ఇలా మాట్లాడుతున్నారన్నారు. టీడీపీలోకి వెళ్లాలనుకుంటే వెళ్లిపోవచ్చని, అంతేగానీ ప్రభుత్వంపై, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై అవాస్తవాలు మాట్లాడటం కరెక్ట్ కాదన్నారు. కోటంరెడ్డి తన సన్నిహితుల ద్వారా తానే చేయించిన రికార్డింగ్ మెసేజ్‌ను పట్టుకొని ప్రభుత్వంపై బురద చల్లాలని చూస్తే ప్రజలు ఆయనకు సరైన సమయంలో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

చివరకు మిగిలేది లోకేష్ ఒక్కరే..
చంద్రబాబు తనయుడు లోకేష్‌బాబు చేపట్టిన పాదయాత్రపై పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు మంత్రి జయరాం సమాధానమిస్తూ 'లోకేష్ పాదయాత్రకు ప్రజల నుంచి ఎలాంటి స్పందనా లేదు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే ఈ విషయాన్ని చెబుతున్నారు. చివరకు పాదయాత్రలో లోకేష్ ఒక్కరే మిగిలినా ఆశ్చర్యం లేదు. పాదయాత్ర అంటే మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆ తర్వాత ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టినవి. వారిద్దరి పాదయాత్రలు చరిత్రలో నిలిచిపోతాయ'ని మంత్రి జయరాం అన్నారు. కార్యక్రమంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీవారి రథోత్సవం

రథం లాగుతున్న భక్తులు



అమరాపురం: అతి పురాతన ప్రసన్న లక్ష్మీవేంకటేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం అమరాపురంలో నేత్రపర్వంగా సాగింది. ఉదయం ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు, హోమాలు పెద్ద ఎత్తున జరిగాయి. మధ్యాహ్నం 3.45 గంటలకు హాజరైన వేలాది భక్తులు గోవింద నామస్మరణ పలుకుతూ రథాన్ని లాగారు. ఈ సందర్భంగా భక్తులు పూలు, పండ్లు, బెల్లం, బొరుగులు తదితర వాటిని రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో ఓ భక్తుడు 'మా నమ్మకం నీవే జగన్', 'ఉయ్ వాంట్ జగనన్న 2024' అంటూ అరటి పండుపై రాసి రథంపైకి విసిరి మొక్కు తీర్చుకున్నాడు. భక్తులకు బాలాజీ ఇండస్ట్రీస్ అధినేత చంద్రశేఖర కుటుంబసభ్యులు అన్నదానం చేశారు. పుల్లయ్య కుమారులు, జగదీష్‌స్వామి కుటుంబ సభ్యులు పానకం, పెసర బేడలు పంపిణీ చేశారు.

హోరాహోరీగా 'ఎస్‌పీఎల్'

అనంతపురం సప్తగిరి సర్కిల్: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో అనంత క్రీడా గ్రామం వేదికగా మూడు ప్రధాన మైదానాల్లో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు రెండో రోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు తలపడ్డారు.

చెలరేగిన భార్గవ్..

ఏఎన్‌కే డిగ్రీ కళాశాల (గోరంట్ల) జట్టుపై టాస్ గెలిచి సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ (పుట్టపర్తి) జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఏఎన్‌కే జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సంస్కృతి జట్టు 9.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో భార్గవ్ తన అద్భుత ఇన్నింగ్స్‌తో 46 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా మారాడు.

ఎస్ఎస్‌జీఎస్ ఆధిపత్యం..

గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ జట్టుపై టాస్ గెలిచిన అనంతపురంలోని కస్తూరి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ చేసిన ఎస్ఎస్‌జీఎస్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. జట్టులో తౌసిఫ్ రజా 15 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్సర్‌తో 31 పరుగులు, విజయ్‌కాంత్ 12 బంతుల్లో 2 సిక్సర్లు, 3 ఫోర్లతో 31 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కస్తూరి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 68 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 64 పరుగులతో ఎస్ఎస్‌జీఎస్ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసింది.

- మరో మ్యాచ్‌లో సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ (పుట్టపర్తి)పై తలపడిన ఎస్ఎస్‌జీఎస్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 89 పరుగులు చేసింది. జట్టులో ఆది 20 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్ల సహాయంతో 41 పరుగులతో రాణించారు. సంస్కృతి బౌలర్లలో జగదీష్ 3, వాసు 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సంస్కృతి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 64 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 26 పరుగులతో ఎస్ఎస్‌జీఎస్ జట్టు విజయం సాధించింది.



అద్భుతమైన షాట్‌తో బంతిని బౌండరీ దాటించిన బ్యాటర్

రవి ఒంటరి పోరు..

రాప్తాడులోని ఎస్వీఐటీ కళాశాల జట్టుపై టాస్ గెలిచి అనంతపురంలోని రైపర్ కళాశాల జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్వీఐటీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసింది. జట్టులో బ్యాటర్ రవి 20 బంతుల్లో 3 సిక్సర్లు, 2 ఫోర్లతో 35 పరుగులు సాధించాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన రైపర్ జట్టు 8 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో కుళ్లాయప్ప 21 బంతుల్లో 1 సిక్సర్, 5 ఫోర్లతో 38 పరుగులు సాధించాడు. దీంతో 6 వికెట్లతో రైపర్ జట్టు విజయం సాధించింది.

బౌండరీల వర్షం..

ఎస్ఎంజేఎల్ (కదిరి)పై ఎస్‌డీఆర్‌ఆర్ (ముదిగుబ్బ) జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్ఎంజేఎల్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది. జట్టులో వెంకటేష్ నాయక్ 23 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 55 పరుగులు, సూరజ్ 18 బంతుల్లో 5 ఫోర్లతో 26 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఎస్‌డీఆర్‌ఆర్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 80 పరుగులు మాత్రమే చేసింది. ఎస్ఎంజేఎల్ బౌలర్లలో వేణు, వంశీ చెరో 3 వికెట్లు సాధించి జట్టు విజయంలో కీలకంగా మారారు.

కొనసాగిన అనంతలక్ష్మి హవా..

అనంతపురంలోని రైపర్, అనంతలక్ష్మి కళాశాలల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రైపర్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేసింది. అనంతలక్ష్మి బౌలర్లు గోవర్ధన్ 3, ప్రశాంత్ 2 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతలక్ష్మి జట్టు 9 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో శ్యాం 17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 35 పరుగులు చేసి, జట్టు విజయంలో కీలకంగా మారాడు.

సాయి బాలాజీ విజృంభణ..

అనంతపురంలోని సాయి బాలాజీ, సాయి సిద్ధార్థ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన సిద్ధార్థ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సాయి బాలాజీ జట్టు 6.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో గిరీష్ 16 బంతుల్లో 20, ప్రశాంత్ 9 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో 24 పరుగులు చేశారు. దీంతో 5 వికెట్లతో సాయి బాలాజీ జట్టు విజయం సాధించింది.

నలంద పేలవం..

అనంతపురానికి చెందిన నలంద, ఆర్ట్స్ కళాశాల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నలంద జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. జట్టులో జాన్ 20 బంతుల్లో 5 ఫోర్లతో 29 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్ట్స్ కళాశాల జట్టు 6 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో భార్గవ్ 14 బంతుల్లో 3 ఫోర్లతో 22 పరుగులు సాధించాడు. దీంతో 9 వికెట్ల తేడాతో ఆర్ట్స్ కళాశాల జట్టు విజయం సాదించింది.

బౌలర్ల శ్రమ వృథా..

అనంతపురానికి చెందిన సాయిబాలాజీ, జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సాయి బాలాజీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 78 పరుగులకు ఆలౌటైంది. జట్టు బ్యాటర్లను కట్టడి చేయడంలో ఓటీపీఆర్ఐ బౌలర్లు మంజునాథ్, వినోద్, శ్రీనాథ్ శ్రమ ఫలించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఓటీపీఆర్ఐ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 52 పరుగుల వద్ద కుప్పకూలింది. జట్టులో రాజశేఖర్ ఒక్కడే 19 బంతుల్లో 2 ఫోర్లతో 21 పరుగులతో ఒంటిర పోరు సాగించినా ఫలితం లేకపోయింది. 26 పరుగులతో సాయి బాలాజీ జట్టు విజయం సాధించింది.



ఎస్వీఐటీపై గెలుపొందిన రైపర్ కళాశాల జట్టు



గోరంట్ల జట్టుపై విజయం సాధించిన పుట్టపర్తి సంస్కృతి కళాశాల జట్టు



ముదిగుబ్బ జట్టుపై విజయం సాధించిన కదిరి జట్టు

ప్రియుడి ఇంటి వద్ద వివాహిత ఆత్మహత్యాయత్నం

రొద్దం: ప్రేమిస్తున్నానని వెంటబడి చివరకు పెళ్లికి నిరాకరించిన యువకుడి ఇంటి ఎదుట ఓ వివాహిత ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం మండలం బాలేపాల్యం గ్రామానికి చెందిన మాల అంజలికి రొద్దం మండలం శేషాపురం గ్రామానికి చెందిన ఓ యువకుడితో వివాహమైంది. ఈ క్రమంలోనే కల్లుకుంట గ్రామానికి చెందిన యువకుడు కళ్యాణ్.. ఆమెను ప్రేమిస్తున్నానని వెంటబడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక అవసరాలు తీర్చుకున్నాడు. ఈ విషయం భర్తకు తెలియడంతో తనను పెళ్లి చేసుకోవాలని కళ్యాణ్‌ను అంజలి కోరింది. ఇందుకు కళ్యాణ్ అంగీకరించలేదు. దీంతో ఆదివారం ఉదయం ప్రియుడి ఇంటి వద్దకెళ్లి మరోసారి తమ పెళ్లి గురించి ఆరా తీసింది. అప్పటికీ కళ్యాణ్ అంగీకరించకపోవడంతో వెంట తీసుకెళ్లిన క్రిమి సంహారక మందు తాగింది. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే ఆమెను పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రియుడు కళ్యాణ్, అతని తమ్ముడు మారుతి, తల్లి రత్నమ్మ, సమీప బంధువు సిద్దప్పపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.



చికిత్స పొందుతున్న అంజలి

వేట కొడవలితో దాడి

నల్లచెరువు: కుటుంబ కలహాల నేపథ్యంలో మామ, బామ్మర్దిపై ఓ యువకుడు వేటకొడవలితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కదిరికి చెందిన బాబా ఫకృద్దీన్‌కు నల్లచెరువులో నివాసముంటున్న మామ మునీర్, బామ్మర్ది సమీర్‌తో మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో తరచూ ఘర్షణ పడేవారు. తనని వ్యక్తిగతంగా దూషించారన్న కారణంతో ఆదివారం వేటకొడవలితో మునీర్, సమీర్‌పై బాబా ఫకృద్దీన్ దాడి చేశాడు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే దాడిని అడ్డుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు బాబా ఫకృద్దీన్‌పై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు.

హెచ్‌టీ లైన్ తగిలి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంతకల్లు: బళ్లారి మార్గంలోని బంటనహాళ్ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడు రైలు పైకి ఎక్కి ప్రయాణిస్తున్న సమయంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురైనట్లుగా నిర్ధారించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే గుంతకల్లు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

మూడు బస్సులు ఢీ

పెనుకొండ రూరల్: డ్రైవర్ల అతి వేగం, అజాగ్రత్త కారణంగా వరుసగా మూడు బస్సులు ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన మేరకు.. ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు ఆదోని డిపో నుంచి బెంగళూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి కియా పరిశ్రమకు కార్మికులను తరలిస్తున్న రెండు బస్సులు వరుసగా ఢీకొన్నాయి. ఘటనలో ఎవరూ గాయపడలేదు. బస్సుల ముందు భాగం అద్దాలు ధ్వంసమయ్యాయి. కియా బస్సుల డ్రైవర్ల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణంగా ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరి మృతి



మృతుడు మంజునాథ్

పరిగి(సోమందేపల్లి): ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పరిగి పోలీసులు తెలిపిన మేరకు... ఆదివారం ఉదయం మడకశిర వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని హిందూపురం వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఘటనలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురూ రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డారు. మంజునాథ్ (27) అక్కడికక్కడే మృతి చెందగా, ఖలీల్, బాబా ఫకృద్దీన్, నిస్సార్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు హిందూపురం ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెలుగు చూసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

అంతర్జాతీయ ఓపెన్ చెస్ చాంపియన్‌గా నోబుల్



చెస్ ట్రోఫీతో శామ్యూల్ స్టీఫెన్ నోబుల్

అనంతపురం సప్తగిరి సర్కిల్: అంతర్జాతీయ ఓపెన్ బిలో 1,600 రేటెడ్ చెస్ చాంపియన్‌గా అనంతపురానికి చెందిన శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ నిలిచాడు. హైదరాబాద్ వేదికగా ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకూ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. టోర్నీలో వివిధ దేశాలకు చెందిన 513 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొత్తం 9 రౌండ్లలో నిర్వహించిన పోటీల్లో 8.5 పాయింట్లను సాధించి అండర్-10 బాలుర విభాగం చాంపియన్‌గా నోబుల్ నిలిచాడు. దీంతో ట్రోఫీతో పాటు రూ.లక్ష నగదును నిర్వాహకులు అందజేసి అభినందించారు. అలాగే అనంతపురానికి చెందిన శ్రీహ 8వ స్థానం, సహృద్ 9వ స్థానాన్ని దక్కించుకున్నారు. వీరికి ట్రోఫీతోపాటు నగదు పురస్కారాలను అందజేశారు.

19న జిల్లా స్థాయి వృషభాల బలప్రదర్శన

కూడేరు: చితంబర స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని కూడేరు మండలం మరుట్ల-3వ కాలనీలో ఈ నెల 19న జిల్లా స్థాయి వృషభాల ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. పోటీల్లో భాగంగా ఒక అడుగు ఎత్తు, ఒకటిన్నర అడుగు వెడల్పు, ఏడున్నర అడుగుల పొడవున్న రాతి దూలాన్ని వృషభాలు లాగాల్సి ఉంటుందన్నారు. ఇందులో గెలుపొందిన వృషభాల యజమానులకు నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని, మరింత సమాచారానికి 98494 23027, 97011 19689, 93901 39909లో సంప్రదించాలని కోరారు.

కదిలింది బ్రహ్మరథం

దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి గాంచిన పావగడ శనీశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవం ఆదివారం వైభవోపేతంగా సాగింది. మధ్యాహ్నం 12.45 గంటలకు జ్యేష్టాదేవి సమేత శనీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను రథంపై అధిష్టింపజేసి, వేలాది భక్తుల గోవింద నామస్మరణ మధ్య లాగారు. రథం పైకి భక్తులు అరటి పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సమితి అధ్యక్షుడు కేవీ శ్రీనివాస్, సుబ్బనరసింహ, ఆనందరావు, విశ్వనాథ్, శ్రీరామగుప్త పాల్గొన్నారు. - పావగడ:



వేలాది భక్తుల మధ్య సాగుతున్న శనీశ్వరుని రథోత్సవం